

# చివరి పిచ్చిక

పాపినేని శివశంకర్

పిచ్చికలకీ ఒక జీవితం ఉంటుంది. ఈ విశాల ప్రపంచంలో వాటికీ ఒక చోటుండాలి. నేనొక చోటులేని పిచ్చికను.

**2**

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్లో ఒక కాకమ్మ, ఒక పిచికమ్మా ఉంటున్నాయి. కాకమ్మదేమో కర్రల గూడు. పిచికమ్మదేమో పిడకలగూడు. ఒకరోజు పెద్ద గాలివాన వచ్చింది. పిచికమ్మ పిడకల గూడు కూలిపోయింది. పిచికమ్మ ఏడ్చుకుంటూ కాకమ్మ ఇంటికెళ్లి, 'కాకమ్మా! కాకమ్మా! తలుపు తియ్యవా? తలదాచుకుంటాను,' అని అడిగింది. కాకమ్మేమో, మా పిల్లాడికి నీళ్లు పోస్తున్నాను, ఇప్పుడు వీలుకాదు పొమ్మంది. పిచికమ్మ కాసేపుండి మళ్లీ తలుపు తట్టింది. కాకమ్మ ఈసారి, మా పిల్లాడికి అన్నం పెడుతున్నాను, వీలుకాదు పొమ్మంది. పిచికమ్మ ఏడ్చుకుంటూపోయి చిన్న గొయ్యి తీసింది. చిన్నమెత్తు బంగారం దొరికింది. పెద్ద గొయ్యి తీసింది. పెద్ద బంగారం దొరికింది! కాలవొడ్డుకు పోయింది. కావెడెత్తు బంగారం దొరికింది! దాంతో అది పేద్ద మేడ కట్టుకుని హాయిగా ఉంది.

అది చూసి కాకమ్మకు కన్ను కుట్టింది. అదిగూడా పోయి, చిన్న గొయ్యి తీసింది. చిన్న తేలు కుట్టింది! పెద్ద గొయ్యి తీసింది. పెద్ద తేలు కుట్టింది! కాలవొడ్డుకు పోయింది. కాలుజారి కాలవలో పడిపోయింది!

పిండారబోసిన వెన్నెలరేయి, ఆరుబయట నులక మంచం మీద పిల్లల్ని నిద్రపుచ్చటానికి చెప్పే కత. వెచ్చని పూరింటి గూట్లో తల్లి రెక్కల కింద మాగన్నుగా ఒదిగే రాత్రుల్లో ఎన్నోసార్లు విన్న కత. నిజంలాంటి అబద్ధమైన కత. కాకమ్మలు ఎప్పుడైనా తలుపు తీస్తాయి. తలుపులు వేసుకునేవి రెండు చేతుల జీవులే.

**3**

గూడులేని పిట్ట బతుకెంత గబ్బుగీమో తల్లిపిట్ట పోవటంతో తెలిసొచ్చింది. ఎండావానల్లో ఎక్కడా తల దాచుకునే తావుండదు. నేనొక్కదాన్నే ఉన్నప్పటి మాట వేరు. అన్ని చెట్లూ, చావిళ్లూ, లోగిళ్లూ నావే. కాని 'పికిలి'తో జత కట్టింతర్వాత గూడు అక్కర తెలిసొచ్చింది. (నా ఒయ్యారి చిన్నారి నెచ్చెలి పికిలి పిట్టకి మల్లే చిన్నగా, ముద్దుగా ఉంటుంది.) పికిలి గుడ్లు పెట్టాలంటే గూడు కట్టాలి. దూరంగా ఏ వాగు ఒడ్డునో గూడు కట్టుకుందామంటుంది పికిలి. తెలివితక్కువది. పంటలకి, పంటలుచేరే లోగిళ్లకి దగ్గర్లో ఉండాల గూడు.

మగపిట్టలే గూడుకట్టాలని, గూడు కట్టటం గొప్ప నేర్పు అని, గిజిగాళ్ల నేర్పు పిచ్చికలకి రాదని, అయినా గూడు కట్టే తెలివినిబట్టే ఆడపిచ్చికలు మచ్చిక అవుతాయనీ తల్లి చెప్పేది. గూటి కోసం ఎట్లాంటి మెత్త మెత్తటి గడ్డిపీచులు ఏరేరి తేవాలో చూపించేది.

అది పెద్ద పూరిల్లు. వాసాలకి, పూరికి నడుంగున అక్కడక్కడ సందులున్నాయి. మంచి సందు ఎన్నుకున్నాను. ఎండ పడని తావు, వానజల్లు పడని తావు. నేనొక్కదాన్నే ఎక్కడెక్కడో తిరిగి, ఒక్కొక్క పీచు ముక్కున గరుచుకుని నాలుగు పగళ్లలో గూడు కట్టాను. అప్పటికే పికిలి మూడు గుడ్ల కడుపుగత్తె.

“మన గూడు ఎంత వెచ్చగా మెత్తగా ఉందో,” అంది పికిలి, చుట్టూ ఉన్న ఎండీ ఎండని పీచులు చూస్తూ. “నామీద నీకు మరులుగదూ, కిచకిచ,” అంది మళ్లీ ముక్కుతో నా ముఖం రాస్తూ. నా కళ్ల కింద తెల్లటి

మచ్చ అంటే దానికెంత ముద్దో. తనకన్న నేనే అందంగా ఉన్నాననటుంది.

ముచ్చటగా మూడు గుడ్లు పెట్టింది. అవి పిల్ల లయ్యేదాకా ఎంత ఆరాటమో! పికిలిని గూట్లో వదిలి నేనొక్కదాన్నే మేతకి వెళ్లేదాన్ని. పాములబారిన బడ కుండా, పెద్దపిట్టల చూపు పడకుండా గుడ్లని, పిల్లల్ని సాకాలి మరి! మూడు గుడ్లల్లో రెండిటి నుంచే పిల్ల లొచ్చాయి. బుల్లిబుల్లి ముక్కుల్తో, వచ్చీరాని రెక్కల్తో ముదురు ఎరుపురంగుతో ముద్దుగారుతున్నాయి. చిన్న చిన్న పురుగుల్ని, లేత గింజల్ని ఏరేరి తెచ్చి వాటి నోట్లో పెట్టేదాన్ని. ఒకేసారి రెండు కాళ్లతో చిన్నచిన్న గంతుల్తో ఎట్లా ఎగరాలో నేర్పేదాన్ని. మా ఆనందం ఎక్కువకాలం మిగల్లేదు. ఒకరోజు నేను, పికిలి మేతకెళ్లి వచ్చేపాటికి గూడు కనపళ్లేదు. మేం బయటికి వెళ్లినప్పుడు ఆ ఇంటి రెండు చేతుల ప్రాణి, పెద్ద కర్రతో గూడు కుళ్లబొడిచి, అవతల పారేశాడు. పూరిల్లు తీసి, డాబా కడుతున్నాడు. చిన్నారి పిల్లల్ని ఏ పిల్లులు తినేశాయో తెలీదు. కీచుకీచు మని ఎంత ఏడ్చినా తీరని దుఃఖం. కసిరి విసిరే రెండు చేతుల ప్రాణుల నడుంగున, వెంటబడే పెద్ద పక్షుల నడుంగున, వలలు విసిరే వేటగాళ్ల నడుంగున ఈ విపరీత ప్రపంచంలో బుల్లి పిచికమ్మల చావు ఎవరికి పట్టింది? తోటి పిచ్చికలు మాత్రమే చుట్టూ చేరి ఓదార్చినయ్యి.

కొన్ని పొద్దులు చిన్నచిన్న పొదల్లో, కంచెల్లో కాలం గడిపాం. ఎక్కడా కుదురులేదు. తిరగ్గా తిరగ్గా ఒక ఇంటి ముందు లోతైన బావి కనబడింది. అడుగు నెక్కడో నీళ్లున్నాయి. పై అంచు నుంచి కొంత లోతు దాకా లోపక్కన చుట్టూ రాతి కట్టుబడి ఉంది. దానికి దిగువ గట్టి గలస. అక్కడొక సందులో గూడు కట్టాం.

'బావిలో గూడు ఆపద చిన్నా!' అనేది తల్లి. వానా కాలం నీళ్లు బాగా ఊరితే గూడు మునిగిపోయిద్ది. అందుకని ముందటేడు నీళ్ల అరవడి ఎంతవరకుందో చూసుకోవాల. లోపల వేడి పసిగట్టాల. పసికందులు దొర్లి నీళ్లల్లో పడకుండా కనుగలిగి ఉండాల. అయితే బావుల్లో తక్కిన ప్రాణుల నుంచి ప్రమాదం ఉండదు.

పిల్లలు పోయిన దిగులు మర్చిపొయ్యాం. నేను, పికిలి ఎన్నెన్ని పొద్దులు బావి తాగాడి మీద హాయిగా గడిపామో! ఒక్కక్షణం పక్కన వాలటం, చటుక్కున ఎగిరి పికిలి మీద వాలటం. రెక్కలలో పొదువుకోవటం, మళ్లీ పక్కనే వాలటం- ఆ మచ్చిక, ఆ మరులు- ఎంత ఉల్లాసం! ఒక్కోసారి పికిలి మీద సరిగ్గా నిలవక పక్కకి జారితే కిచకిచలాడేది. బావి బొడ్డు చుట్టూ గట్టుమీద నీళ్ల చెలమల్లో పొర్లిపొర్లి రెక్కలల్లార్చేవాళ్లం. ఎప్పుడన్నా కాకులో, కుక్కపిల్లలో బావి గట్టుమీద నీళ్లు చప్పరించ టానికొచ్చేవి. అప్పుడు రివ్వున బావిలోపలికి దూసుకెళ్లి, గూట్లో రెక్క రెక్క రాసుకొని, ఒదిగిపొయ్యేవాళ్లం. అప్పు డప్పుడు చేంతాడు కట్టిన కడవ దబీమని నీళ్లల్లో పడే టప్పుడు మాత్రం ఒడుపుగా తప్పించుకోవాల. నీళ్లు ముంచుకొని కడవ బరువుగా పైకెళ్లేటప్పుడు దాని మీద సరదాగా వాలటం, అది పిట్టగోడ మీదకి రాంగానే రయ్యిన ఎగిరి గూట్లో వాలటం. అవి మా ఆనంద క్షణాలు. పికిలి మళ్లీ నీళ్లాడింది.

ఆ యేడు వానల్లేవు. బావిలో నీళ్లెండిపోయాయి. గొంతులెండిపోతున్నాయి. ఒకరోజు ఉన్నట్టుండి పెద్ద పెద్ద మట్టిపెళ్లలు పైనుంచి పడ్డాయి. తాగాడి విరిగి పడింది. ఆ ఇంటి ప్రాణులు నీళ్లులేని బావిని పూడ్చి, ఇంకేదో సన్నటి గుంట తియ్యాలని పూనుకున్నాయి. బతుకుజీవుడా! అని పైకెరిగి పారిపొయ్యాం. రెక్కలు రాని పిల్లలు అక్కడే మట్టయిపొయ్యాయి. మా బతుకుల్లో మళ్లీ ఎండ, వాన, దుఃఖం మిగిలినయ్యి.

**4**

''ఈ పల్లెపట్టుల కన్న పట్టణాలే బాగుంట య్యేమో,'' అన్నాను పికిలితో ఆ పూట. ''అక్కడ చెట్టు చేమ ఉండొద్దూ?'' అంది పికిలి.

అయినా చూసివద్దామని ఆరోజు పగలంతా ఎగిరి, ఎగిరి దవ్వున పరుచుకున్న మేడల అడివి చేరు కున్నాను. చెట్లులేని అడివి. నా జాతివాళ్లు ఎక్కడా కన పడలేదు. అట్లా తిరుగుతూ తిరుగుతూ ఒక భవనం దగ్గర ఆగిపోయాను. లోపల ఎన్నో రెండు చేతుల ప్రాణులు కూర్చుని ఉన్నాయి. ఎదురుగా ఎత్తయిన చోట ఇంకో ప్రాణి నిలబడి ఉంది. వాటికి దగ్గర్లో విరిగి పోయిన, ఆకులు, వేళ్లు తెగిపోయిన చెట్లెన్నో పడి ఉన్నాయి, మొండేల్లాగా. నేనొక కిటికీ రెక్కమీద వాలి చూస్తున్నాను. ఆ ఎత్తయిన చోట నిలబడ్డ ప్రాణి ఇట్లా చెప్తాంది -

''మిత్రులారా! జాతుల అంతర్ధానం మీద ఈ మహాసదస్సు ఏర్పాటుచేశాం. యుగయుగాలుగా ప్రకృతి మీద పోరాటం సాగించి, మనిషి తన ఉనికి స్థిర పరుచుకున్నాడు. ఇప్పుడు మనకు ప్రకృతి వల్ల ఏ భయంలేదు. అయితే ప్రకృతే మనల్ని చూసి భయపడు తున్నట్టుంది. లేకపోతే ఇన్నిన్ని చెట్లు, పక్షులు చనిపో వటం ఏమిటి? ముందుగా వాటి అకాలమరణానికి సంతాపం ప్రకటిద్దాం.''

ప్రాణులన్నీ విచారంగా లేచి నిలబడ్డాయి. వాటి కళ్ల నుంచి కన్నీళ్లు రాలుతున్నాయి. అంతా కపటంగా అన్పిస్తుంది. అసహ్యం వేసింది. 'క్లీక్! క్లీక్!' అంటూ కోపం చూపించాను. ఈ రెండు చేతుల జాతికి ఏవి అంతరించినా ఏమీపట్టదు. ఇవన్నీ పైపై మాటలే. నిజానికి ఈ జాతి ప్రపంచాన్ని మోసగించటానికే మాటలు నేర్చింది.

## 5

కాలం వడివడిగా ఎగిరిపోతోంది. రానురాను మాకు మేత దొరకటం కష్టమైపోయింది. వాగుల్లో వంకల్లో చిన్నచిన్న చేపలు తప్ప పురుగులు దొరకటం లేదు. ఏ పొలాల్లోను వెనకటి పైర్లు కనపట్టంలేదు. గింజల పైర్లు గాక ఏవేవో అబ్బురమైన మొక్కలు మొలుస్తున్నాయి. ఎన్నో చేతుల జంటలు వాటిని మురిపెంగా సాకుతున్నాయి.

మబ్బులపైన ఎగరటం కష్టం. అది పెద్దపెద్ద గద్దలు, డేగలకే వీలవుతుంది. మేత కోసం చానా దవ్వు వెళ్లాల్సినప్పుడు అల్లంత ఎత్తులో మబ్బుల కిందుగా ఎగురుతూ పోతాను. కాసేపు రెక్కలల్లార్చి, కాసేపు ముడిచి గాలిలో దూసుకెళ్తుంటే తేలిగ్గా, హాయిగా ఉంటుంది. మబ్బు పెడసరంగా ఉన్నప్పుడు పైనెక్కడో తెల్లగా వెళ్లిపోతుంటుంది. అది దయగా నల్లగా మారి నప్పుడు దానికింద ఎంత చల్లగా ఉంటుందో!... అప్పుడు మబ్బు నన్నడిగింది.

"వన్నెచిన్నెల పిట్టా! పికిలి జతగాడా! ఎందుకంత వడిగా వెళ్తున్నావు?"

"ఇంక దేనికమ్మా? మేతకోసమే."

"చల్లగా ఉంటుందని మునుపు నన్ను రాసు కుంటూ నా నీడ కింద గుంపులు గుంపులుగా ఎగిరి పొయ్యేవాళ్లు. ఇప్పుడు మీవాళ్లంతా ఏమయ్యారు? ఒకళ్లూ అరా తప్ప కనపట్టమే లేదాయె."

అప్పుడు మొదటిసారి తట్టింది. చుట్టాలు, చెలి కాళ్లు అంతా మెల్లమెల్లగా చీకటిలో కలిసిపోతున్నారని. ఒక్కసారి తెలీని భయంతో ఒళ్లంతా వణుకు పుట్టింది.

నిజం. ప్రపంచం మునుపు మాదిరిలేదు. వేగంగా భయం గొలుపుతూ మారిపోతుంది. ఏమిటో ఎందుకో తెలీటంలేదు. మబ్బులకు కోపం వచ్చింది. వానలు తగ్గి పోతున్నాయి. చెరువులు, దొరువులు పొంగిపొర్లటం లేదు. బీళ్లు పచ్చగా కళకళలాడటం లేదు. పంటచేలో వాలితే ఇంతకు ముందు ఎన్నెన్ని బుల్లి పురుగులు దొరికేవో! (పికిలికి గింజల కన్నా పురుగులే ఇష్టం.) ఇప్పుడు పంటచేల మీద వందల చేతులు ఏవో తెల్లని ద్రావకాలు చల్లుతున్నాయి. పురుగులు మాడిపో తున్నాయి.

*దేశాల మందులన్ని పైరుల్లారా!*
*మీపైన జల్లేము పైరుల్లారా!*
*మా మీన దయజూపి పైరుల్లారా!*
*కాసులను రాల్చండి పైరుల్లారా!*

పంటపొలాల్లో ఎక్కడ విన్నా ఇవే పాటలు.

## 6

"బంగారుకాలం దాటిపోయింది పికిలీ!" అన్నా నొకరోజు పికిలితో. జమ్మిచెట్టు కొమ్మమీద ఇద్దరం పక్కపక్కనే కూచున్నాం.

"మనకు తెలీకుండా మన ముందు నుంచే కాలం ఎట్లా దాటిపోయింది?" అనడిగింది పికిలి.

"అదే నాకూ తెలీటంలేదు. నా చిన్నప్పుడు (అప్పుడు నువ్వు కన్ను తెరిచావో లేదో) తల్లి నన్ను తీసుకొని పొలాల మీదకి పోయేది. అప్పుడు నేల ఎంత హాయిగా సువాసనాభరితంగా ఉండేది? ఎన్ని వేల రెక్కల దవ్వు రివ్వురివ్వున ఎగిరినా అలుపు, సొలుపు ఉండేవి కాదు. జొన్న, సజ్జ, రాగులు, వరిగెలు- ఎన్నిరకాల పైర్లో! ఈ చేలో నాలుగ్గింజలు, ఆ చేలో నాలుగ్గింజలు- అట్లా అట్లా కొండలదాకా ఎగురు కుంటూ పోయేవాళ్లం. ఒకసారి నాకు చానా అలుపు వచ్చినప్పుడు సరిగా ఎగరలేక అడిగాను, 'తల్లిపిట్టా! ఇంత దూరం ఎందుకు ఎగరటం? ఒక్క మంచి చేలో గింజలు తింటూ పొట్ట నింపుకోవచ్చుగదా?' అని. తల్లి కిచకిచా నవ్వింది. (ఆ నవ్వంటే నాకు బలే యిష్టం.) 'చిన్నా! తెలుసుకో. పిల్లలకి ఏడిస్తే బలం, పిచ్చికలకి ఎగిరితే బలం.'

"ఎప్పుడన్నా ఆదమరిచి అదేపనిగా ఒకే కంకి మీద వాలి ఉంటే మందలించేది, 'అదుగో, ఆ మంచె మీద చేతుల జీవిని చూశావా? దాని చేతుల్లో ఉన్నదే వడిసెల. దాన్లో రాయి పెట్టి గురిచూసి వదుల్తుంది. తగిలిందంటే గిలగిలలాడి కింద పడాల్సిందే. పిట్ట ఎగర లేక నేల గూలిందంటే ఆ పొద్దుతో దానికి నూకలు చెల్లినట్టు లెక్క.'

"తల్లి మళ్లీ చెప్పింది. 'చిన్నా! సృష్టిలో చేతులు న్నది ఈ ప్రాణి ఒక్కదానికే. అది తన సుఖం కోసం ఏ పనైనా చేస్తుంది. చెట్లకు బలవంతపు కాపు కాయి స్తుంది. వాటిని నరుకుతుంది. పిట్టల్ని, మేకాల్ని వేటాడి తింటుంది. మోసం చేసి, మచ్చిక చేసి, మెకాల్ని తాళ్లతో

కట్టి పనులు చేయించుకుంటుంది. నేల మీద సంపద అంతా తనకే చెందాలని దాని ఆరాటం. ఏదో ఒకనాటికి ఈ రెండు చేతుల జీవి వల్లనే మన జాతి అంతరిస్తుం దని నా భయం.'

"నేను బెదిరిపోతుంటే తల్లి నన్ను రెక్కల కింద పొదువుకుంది. (నీకు తెలుసా, అది నాకెంతో యిష్టమైన తావు.) అయితే అప్పటికింకా కాలం ఇంతగా మార లేదు."

నా మాటలు వింటూ పికిలి దగ్గరగా జరిగి ఆప్యా యంగా అడిగింది, "బంగారు కాలాలు ఎట్లా ఉండేవో, ఇంకా చెప్పవా?"

"ఒకరోజు గూట్లో తల్లి నిద్రపోతుంటే నా రెక్కలు ఒక్కసారిగా సలపరించాయి. పైరగాలి. ఒళ్లంతా తుళ్లింత. ఒక్కసారి రెక్కలు విదిలించి పైకెగిరాను. అలా, అలా గాల్లో తేలిపోతుంటే ఒక తావున పచ్చని జొన్నచేను కనిపించింది. గాలికి జొన్నకర్రలు గరగర మంటున్నాయి. పైరు సుంకు మీదుంది. అక్కడక్కడ, కొన్ని కంకులు ఇప్పుడిప్పుడే పాలు పోసుకుంటున్నాయి. ఎంత సువాసనో! జొన్నచేల మీద తయిక్కున వాల గూడదు. మెలకువ ఉండాల. లేకపోతే ఆకులు గీసు కుంటాయి. ఒక కంకి మీద వాలి అటు, ఇటు కన్ను తిప్పాను. దవ్వున మంచె. పైన ఎవరూ లేరు. వడిసెల రాయి భయం లేదు. కంకి మీద అదాటున వాలానేమో, అది రవ్వంత వంగింది.

'తాళు, తాళు. ఎందుకంత తొందర?' అంది జొన్నకర్ర.

'నీకేమమ్మా! ఒక్క తావునే చక్కగా పెరిగేదానివి. నేనేమో పొట్టకోసం పది తావులకి పరిగెత్తాల్సిన దాన్ని, అందుకే తొందర,' అన్నాను నేను.

'నిజమే కాని, నా కస్తి నాది. వానగురిసి పద మూడు పొద్దులైంది. కిందకి ఎంత తొలుచుకు పోతున్నా నేలతల్లిలో చెమ్మ తగలటంలేదు. సుంకు రాలిపో తుంది. గింజ గట్టిపడటంలేదు,' విచారంగా చెప్పింది జొన్నకర్ర.

'మరి నేను ఇంకోతావుకి వెళ్లిపోనా?' అనడిగాను.

'మంచిదానివే! నువ్వు కూడా నా కంకి-కూతురు అసుమంటిదానివే. ఎంతసేపైనా నామీన కూకో. రెట్ట మాత్రం వెయ్యబాకు,' అంది జొన్నకర్ర.

'కిచ్‌కిచ్' అంటూ కుశాలగా ఒక గింజ పొడుచుకు తిన్నాను. ఎంత రుచిగా ఉందో. 'సరే గానీ! నేను పద్దాక నిన్ను పొడుస్తుంటే నీకు నెప్పిగా ఉండదా?' అనడిగాను.

"జొన్నకర్ర అటు ఇటు విరగబడి నవ్వింది. 'బిడ్డ చన్ను గుడుస్తుంటే తల్లికెంతో ఆనందమంటారు. నువ్వు సన్నటి ముక్కుతో నూగులో దాక్కున్న గింజల్ని పొడిచి తింటుంటే నాకు పులకింతగా ఉంటుంది,' అంది.

"జొన్నకర్రల మీద, సజ్జకంకుల మీద, ఎడ్ల కొమ్ముల ఉయ్యాల మీద, పెద్దపెద్ద కల్లాల మీద నిలిచిన కాలం బంగారు కాలం. నా చిన్నప్పుడు పూరిళ్లల్లో గూళ్ల దగ్గరే ధాన్యం కంకులు వేలాడగట్టి ఉండేవి. ముక్కు ముందే కమ్మని మేత. అది బంగారు కాలం. ఇప్పుడు ఆ పైర్లు లేవు. కల్లాలు లేవు. కంకులు లేవు. అంతా వెతుకులాటే."

## 7

ఇక రెండు చేతుల ప్రాణులకు దగ్గర్లో ఉండ రాదని గట్టిగా చెప్పుకున్నాం ఇద్దరం. ఊరి వెలపల వాగు ఒడ్డున తుమ్మలున్నాయి. కంచెలున్నాయి. అక్కడొక గుబురులో గూడు కట్టాం. కాకపోతే మేత కోసం చాన దవ్వు తిరగాల.

మా కంచె పక్కనే పెద్ద తుమ్మచెట్టు ఉంది. దాన్నిండా గిజిగాడి గూళ్లు వేలాడుతున్నాయి. అట్లా గూడు అల్లటం ఎంత కష్టపడ్డా మాకు రాదు. మెత్తటి పీచులు వెతుక్కోవటంలోనే సరిపోతుంది. ఆ పొద్దు తుమ్మచెట్టు అంది ప్రేమగా.

'చిన్నారి పిచ్చికా! చిన్నారి పిచ్చికా! వానకారు, చలి కారు, వడకారు అన్నీ మారిపోతున్నాయి చూశావా? నేను చాలా ఎత్తయినదాన్ని. నూరుమానుల దవ్వు చూడగలను. నా చూపు అందినంతదాక ఎక్కడా పిచికల జాడ కనపట్టంలేదు. ఒకప్పుడు ఎన్నెన్ని గుంపులు నామీద వాలేవో! నువ్వే నీ జాతిలో చివరిదాని వనుకుంటా. భద్రం. నీ జాతిని దుంపనాశనం కానియ్య బాకు.'

భయంతో వణికిపోయాను. నిజమే. ఎక్కడా తోటి పిచ్చికల జాడ కన్పించటంలేదు. అంతా ఏదో పాతాళంలో కూరుకుపోయినట్టుంది. మేమిద్దరమే మిగిలినట్లుంది. ఇంతలో ఇంత మార్పు ఎట్లా వచ్చింది?

పికిలి మళ్లీ గుడ్లకొచ్చింది. నేనే మేత సంపాదిం చాలి. ఆ పొద్దున మేత దొరక్క ఎంత దూరం తిరిగానో. ఎక్కడా నీటిజాడ లేదు. ఒకటే దప్పిక. ఎక్కడ చిన్న నీటిచెలమ కనపడినా నాలుగు చుక్కలు మింగి, నీళ్లలో రెక్కలల్లార్చితే పోయిన సత్తువ తిరిగొస్తుంది. పత్తి, మిరప తోటల్లో ఎంత తిరిగినా ఏవో ద్రావకాలు, చల్లగా నిశ్చలంగా పడిపోయిన పురుగులు తప్ప ఇంకేమీ లేవు.

అవే రెండు మూడు ఆబగా తిన్నాను. ఇంకా నాలుగైదు చచ్చిపోయిన పురుగుల్ని ముక్కుతో కరుచుకుని తెచ్చాను. పికిలి ఆకలి మీదుంది. ఇవెందు కిట్లాగై పోయాయని అడిగింది. చెప్పాను. ఇంకేం మాట్లాడకుండా ఆ రుచిలేని మేతే తింది. వాటిల్లో విషం దాక్కుందని మాకు తెలీదు. అదే పికిలికి చివరాఖరి రేయి. నాది మొండి ప్రాణం.

## 8

ఇప్పుడు నా పక్కన పికిలి లేదు. చుట్టాలు, పక్కాలు లేరు. మబ్బుల కిందుగా ఎగిరేటప్పుడు కుడి ఎడమల హాయి గొలిపే రివ్వురివ్వుల, కిచకిచల పలకరింతల్లేవు. పులకరింతల్లేవు. ఇది ఎడారి. ఎడారి పిచ్చికల తావు గాదు. ఇది రెండు చేతుల ప్రాణుల ఉనికిపట్టు.

ఎక్కడ నెలకి మూడు వానలు మట్టిని ముద్దాడుతాయో, ఎక్కడ అడవులు, బీళ్లు అనంతంగా విస్తరిస్తాయో, ఎక్కడ పొలాల్లో విషం లేని గింజలు మొలుస్తాయో, ఎక్కడ వేలవేల పిచ్చికల, పికిలి పిట్టల, కాటిక పిట్టల రెట్టల్తో నేల పునీతమౌతుందో, ఎక్కడ భయంకరమైన రెండు చేతుల ప్రాణులకు తావులేదో ఆ సార్థక లోకానికి ఎగిరిపోయే రోజొచ్చింది.

నాతో పిచికల జాతి అంతమవుతుంది. పిచ్చికలకు చోటులేని ఈ ప్రపంచం ఒకనాటికి ఎడారిగా మారిపోవును గాక! దయలేని రెండు చేతుల జాతి, సమస్తాన్నీ ధ్వంసం చేస్తూ చివరికి తానే ధ్వంసమగును గాక! ఇది ఈ చివరి పిచ్చిక శాపం. పిచ్చిక విసిరిన బ్రహ్మాస్త్రం.

ఒక్కసారి అదే చివరిసారి- నా సమస్త శక్తుల్నీ రెక్కల్లో మోహరించి పైకెగిరాను. పుట్టల మీదుగా, గుట్టల మీదుగా, గాలిలో గాలినై, మబ్బులో మబ్బునై, మబ్బుల తలలపైన అనంతాకాశంలో నీలిమనై పోయాను. ఈ లోకానికి దూరంగా, దూరదూరంగా, నాకే తెలీని మరోలోకంవైపు అలా అలా ఎగసిపడుతూ... ఎగురుతూ... ఎగురుతూ...

*ఈనాడు ఆదివారం, 29 ఫిబ్రవరి 2004*

